తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వెంకన్న ఆశీస్సులందుకున్నాం

తిరుమల, ఏప్రిల్ 2 ప్రభాతవార్తప్రతినిధి:



కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం ఉదయం పలువురు ప్రముఖులు విఐపి బ్రేక్‌దర్శన సమయంలో దర్శించుకున్నారు. తెలంగాణా రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి కెఎస్ శ్రీనివాసరాజు, తిరుపతి నగరపాలక కమిషనర్ అనుపమఅంజలి కుటుంబసభ్యులతో కలసి వెంకన్న ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులతో పోటెత్తిన బోయకొండ

బోయకొండ(చౌడేపల్లి), ఏఫ్రిల్ 2 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొండ దినాన్ని పురష్కరించుకొని అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేకా భిషేకం, అలంకరణగావించారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనా డుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలి రావడంతో క్యూలైన్లన్నీ నిండి పోయాయి. పరి పాలనా భవనం పక్కనే గల షెడ్లలో అమ్మవారి పవిత్ర ప్రసాదా లు విక్రయించే కౌంటర్లను ఏర్పాటు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేసారు. ఇఓ చంద్రమౌళి, అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు సేవలందించారు.

# నేటి నుండి 'పది' పరీక్షలు

- ★ పరీక్షలకు హాజరు కానున్న 21.996 మంది విద్యార్థులు
- ★ పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం
- ★ కాపీయింగ్ అడ్డుకట్టకు 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- ★ విద్యార్థులకు డెస్కులు తప్పనిసరి
- ★ విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వరకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం
- ★ పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పక్కాగా 144 సెక్షన్ అమలు



చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సోమవారం నుండి ప్రారంభం కానున్న పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసింది. జిల్లాలో గత ఏడాది టెన్త్ పరీక్షల సందర్భంగా ఉత్పన్నం అయిన సంఘటనలు ఈ ఏడాది పునరావృతం కాకుండా వుండటానికి కలెక్టర్ హరినారాయణన్ పకడ్బందీ చర్యలు తీసుకొన్నారు. పరీక్ష గదిలో సెల్‌ఫోన్లు అనుమతించడంతోనే గత ఏడాది జిల్లాలో పేపర్ లీక్ అయ్యిందని స్పష్టం కావడతో ఈ ఏడాది సెల్‌ఫోన్లను పరీక్ష విధులకు హాజరయ్యే ఏ ఒక్కరు ఉపయోగించకూడదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరిటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, పరీక్షా విధులకు హాజరయ్యే ఇన్విజిలేటర్లు, సిబ్బంది ఏ ఒక్కరు సెల్‌ఫోన్లను తీసుకెళ్ళరాదని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్ళరాదని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో విద్యార్థులు హాజరు కావడానికి అధికారులు ఉచిత ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌళిక సౌకర్యాలు కల్పించడానికి వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేశాయి. టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ అడ్డుకట్ట వేయడానికి జిల్లా వ్యాప్తంగా 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఒకొక్క ఫ్లయింగ్ స్క్వాడ్‌లో రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ అధికారులు వుంటారు. అలాగే మాస్ కాపీయింగ్ జరుగడానికి అవకాశం వుందని అనుమానించిన ఏడు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల నిఘాలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. టెన్త్ పరీక్షలు జరిగే కేంద్రాల పరిసరాల్లో పోలీసు శాఖ పరీక్షలు ప్రారంభానికి ముందు నుండి పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలు చేస్తోంది. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో వున్న జెరాక్స్ సెంటర్లు పరీక్షలు ప్రారంభం కావడానికి ఒక గంట ముందు మూసి వేయడానికి పోలీసులు చర్యలు తీసుకొంటారు.

### టెన్త్ విద్యార్థులకు విజయోస్తు: కలెక్టర్ హరినారాయణన్



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సోమవారం నుండి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విజయోస్తు కలుగాలని కలెక్టర్ హరినారాయణన్ దీవించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టెన్త్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వర్తించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేశామని ఆయన వివరించారు. జిల్లాలో సోమవారం నుండి ఈ నెల 18వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 115 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. టెన్త్ పరీక్షలకు 21,996 మంది విద్యార్థులు హాజరు కానుండగా ఇందులో 11,140 బాలురు, 10,556 బాలికలు వున్నారన్నారు.

## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్య

### కారుకు నిప్పంటించి మృతదేహం కాల్చివేత



రామచంద్రాపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్యకు గురైన సంఘటన శనివారం రాత్రి గంగుడుపల్లి సమీపంలోని కురవకనంలో చోటుచేసుకున్నది. నిందితులు మృతదేహాన్ని కారులో వుంచి నిప్పంటించి కాల్చివేశారు. పోలీసులు వెళ్ళడించిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం, బ్రాహ్మణపల్లికి చెందిన జయరామయ్య కుమారులు నాగరాజు, పురుషోత్తం ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా బెంగుళూరులో పనిచేస్తున్నారు. మహాశివరాత్రి రోజున గ్రామానికి చెందిన ఓ మహిళతో పురుషోత్తం సన్నిహితంగా వుండటాన్ని ఆమె భర్త రుపింజయ చూసి అతడితో ఘర్షణ పడ్డాడు. దీంతో నాగరాజు తన తమ్ముడు పురుషోత్తంను బెంగుళూరుకు పంపివేశాడు. నాగరాజు తిరుపతి సమీపంలోని అవిలాలలో కాపురం వుంటూ వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం



వారాంతపు సెలవు కావడంతో స్వగ్రామానికి చ్చాడు. ఉదయం 9 గంటలకు వెళ్ళిన భర్త రాత్రి 8 గంటల వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య మధుమతి ఫోన్ చేసింది. 20 నిమిషాల్లో వస్తానని ఫోన్ కట్ చేశాడు. తిరిగి 9 గంటలకు మరోమారు ఫోన్ చేసిన భార్యకు దగ్గర్లో వున్నా వస్తానంటూ ఫోన్ కట్ చేశాడు. ఆపై ఏమి జరిగిందో కానీ కురవకనంలో కారు మంటల్లో కాలిపోతుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి మృతుడి కుటుంబ సభ్యులు చేరుకుని ప్రక్కనే పడివున్న బంగారు చైన్, చెప్పులను గమనించి మృతుడు నాగరాజుగా గుర్తించారు. ఏఎస్పీ వెంకట్రావ్, డిఎస్పీ నరసప్ప, సిఐ ఓబులేష్, ఎస్ఐ గిరిబాబు క్లూస్‌టీమ్‌తో కలసి సంఘటనా స్థలిని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గ్రామనికి చెందిన రుపింజయ, చాణుక్య ప్రతాప్‌తో పాటు మరి కొందరిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహం బాగా కాలివుండటంతో సంఘటనా స్థలిలోనే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## స్కామ్‌లన్నీ బయటకు వస్తాయి

### -ఎమ్మెల్యేలను కొనడమే చంద్రబాబు నైజం
### -ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి



తిరుమల, ఏప్రిల్ 2 ప్రభాతవార్తప్రతినిధి:
గత తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అనేక స్కామ్‌లు త్వరలోనే వెలుగుచూస్తాయని, అన్యాయం చేసేవారిని ఎవరినీ శక్తివంతమైన దేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి క్షమించడని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఎన్టీఆర్ టిడిపిని స్థాపించి అధికారంలోకి తెస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేలను చంద్రబాబు కొని ప్రభుత్వం ఏర్పాటుచేశాడన్నారు. గతంలో ఎమ్మెల్యేలను 23మందిని కొనుగోలుచేసిన చంద్రబాబుకు 2019లో ఆ 23మందే నిలిచారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో కొందరి స్కామ్‌లు బయటకు వస్తాయని ఆయన అన్నారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌దర్శన సమయంలో ఆయన శ్రీవేంకటేశ్వరుని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారు

### మంత్రి రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

నగరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని మంత్రి రోజా తెలిపారు. రానున్నఎన్నికల్లో చంద్రబాబు కుతంత్రాలు ఏపీ ప్రజల వద్ద పని చేయవని, టీడీపీ ఆరిపోయే దీపమని పేర్కొన్నారు. ఆదివారం నగరిలోని మంత్రి కార్యాలయ ఆవరణలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేడు రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉందంటే అది కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కారణమన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రజల అభిమానం, నమ్మకం అన్నపునాదులపై నిర్మించబడిందన్నారు. జగనన్న లాంటి వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టమన్నారు. ప్రజల మన్ననలను పొందిన ఎన్‌టీఆర్, వైఎస్ఆర్ తరువాత వారికన్నా మరింత ప్రజాభిమానాన్ని పొందిన ఏకైక ప్రజా నాయకుడు జగనన్నే అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసి ఆ తరువాత దానిని పక్కకు పడేస్తాయని, అయితే జగనన్న మాత్రం తాను విడుదల చేసిన మేనిఫెస్టోని ఒక భగవద్గీతగా ఒక బైబిల్ భావించి 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఇలాంటి మనస్సున్న ధైర్యవంతుడైన సీఎంను మనం మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోఎమ్మెల్యే రోజాకు బడా నాయకుల నుంచి వెన్నుపోట్లు తప్పదని అందరూ చెవులు కొరుకున్నారని అయితే నగరిలోని కార్యకర్తలు, నాయకులు మాత్రం తాము జగనన్న వెంటే ఉన్నామని చాటి చెబుతూ ప్రతి ఎన్నికల్లో విజయఢంకా మోగించారని తెలిపారు. నగరి నియోజకవర్గంలో 5 ఎంపీపీలు, 5 జడ్పీటీసీలు, రెండు మున్సిపల్‌చైర్మన్లను ఏకపక్షంగా గెలిపించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ స్థానాలు గెలిచిన వైసీపీ పార్టీ ఎలాంటి ఆర్భాటాలు చేయలేదని, ఉత్తకుండకు ఊపు డెక్కువ అన్నచందాన నాలుగు ఎమ్మెల్సీలు గెలిచిన టీడీపీ సంబరాలు చేసుకుంటోందన్నారు.

## నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన జగన్

### - మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి



పలమనేరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త :
రాష్ట్రంలో యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందని మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. ఆధివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టి అధికారంలోకి రాగానే ప్రతిఏటా రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని, ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదిన జ్యాబ్ క్యాలెండర్‌లు విడుదల చేస్తామని మాయమాటలు చెప్పిన జగన్ రెడ్డి నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగా స్వయం ఉపాధికి సైతం ప్రభుత్వంనుంచి సహకారం అందక యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సి.ఎం.ఐ.ఈ నివేధిక ప్రకారం రాష్ట్రంలో 2019 ఏప్రిల్ నాటికి 4.0శాతం ఉన్న నిరుద్యోగత 2022 డిసెంబర్ నాటికి 7.7 శాతానికి పెరిగిందన్నారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తామన్న జగన్ రెడ్డి ఎన్ని కాంట్రాక్టులిచ్చారని ఎంతమందిని కాంట్రాక్టర్లుగా తయారు చేసారని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యువనేస్తం పథకం ద్వారా ప్రతినెల 6లక్షల మందికి రూ.2వేలు నిరుద్యోగభృతి అందిస్తే జగన్‌మోహన్ రెడ్డి ఆ పథకాన్ని రద్దుచేసి నిరుద్యోగుల్ని నిలువునా ముంచారన్నారు. వైకాపా ప్రభుత్వంలో యువతకు ఉపాది కల్పించలేక పోయినప్పటికీ గంజాయి అక్రమ రవాణాలో ఆంధ్రప్రదేశ్‌ను మెదటి స్థానానికి తీసుకువచ్చారని ఎద్దేవా చేసారు. వైకాపా నుండి 25మంది ఎంపిలను గెలిపిస్తే కేంద్రం మెడలువంచి ప్రత్యేకహోద సాధిస్తానన్న జగన్ రెడ్డి డిల్లీకి వెళ్ళి తలదించుకుంటున్నాడని ఎద్దేవా చేసారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

## తిరుపతి కార్పొరేషన్‌లో శెట్టిపల్లి విలీనం

### -మంగళం హెడ్ క్వార్టర్స్‌గా నాలుగు మజరా గ్రామాలు

తిరుపతిరూరల్, ఏఫ్రిల్02 ప్రభాతవార్త:



శెట్టిపల్లి గ్రామ పంచాయతీని తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఈనెల 21న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెల్సిందే. ఆంధ్రప్రదేశ్ గెజిట్ ప్రభుత్వ ఆదేశాల మేరకు శెట్టిపల్లి గ్రామ పంచాయతీలోని ఐదు మజరా గ్రామాలు 1.శెట్టిపల్లి, 2.శెట్టిపల్లి హరిజనవాడ, 3.సి.ఆర్.ఎస్.క్వార్టర్స్, 4, ఉప్పరపాలెం, 5.వినాయక నగర్‌లను తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం చేయబడ్డాయి. శెట్టిపల్లి గ్రామ పంచాయతీ పున:నిర్మాణంతో మిగిలిన నాలుగు మజరా గ్రామాలతో కలిసిన మంగళం గ్రామ పంచాయతీ మంగళం హెడ్ క్వార్టర్స్‌గా ఏర్పాటు చేసారు. 1.మిట్టగాంధీపురం, 2.మిట్ట గాంధీపురం హరిజనవాడ, 3.చెన్నాయగుంట, మంగళం గ్రామాలు మంగళ హెడ్ క్వార్టర్ పరిధిలోకి వస్తాయి. గెజిట్ అనుగుణంగా సంబంధిత (పంచాయతీ) అధికారులకు జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశాలు జారీ చేసారు.

## కన్నులపండువగా పెద్దకొట్టాయ్ ఉత్సవాలు



శ్రీకాళహస్తి, ఏఫ్రిల్ 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరగుతున్న పెద్దకొట్టాయ్ ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం ఆలయంలోని అలంకారమండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అలంకార మండపం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద పెద్దకోటమండపం చుట్టు మూడు ప్రదక్షిణలు చేసి కోటమండపం వద్ద ఉంచి స్వామిఅమ్మవార్లకు మంత్రపుష్పం, విశేష నైవేద్యం నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అలంకరణ ఇట్టే ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు. ఆలయాధికారులు దేవస్థానం సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, మరియు అభిషేక గురుకుల్ సురేష్, ఉపప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, మరియు వేదపండితులు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## అధికార వైకాపాతో ప్రతిపక్ష తెలుగుదేశం మైండ్‌గేమ్!

### ఇద్దరు ఎమ్మెల్యేలు టచ్‌లో వున్నారని చెప్పడంతో ఉలిక్కిపడ్డ వైకాపా - ఆ ఇద్దరు ఎవరనే విషయంపై చర్చ

చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మళ్ళీ మైండ్ గేమ్‌కు సిద్ధమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు వైకాపా ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో వున్నారని ఆ ఎమ్మెల్యేలు ఎప్పుడైనా తమ పార్టీలో చేరవచ్చునని చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని ప్రకటించడంతో అధికార వైకాపా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అధికార వైకాపాలో అసంతృప్తిగా వుండి తెలుగుదేశం పార్టీలోకి వెళ్ళడానికి సిద్ధంగా వున్న ఎమ్మెల్యే ఎవరనే విషయంపై ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా జోరుగా చర్చ జరుగుతుంది. రాష్ట్రంలో గతంలో అధికారంలో వున్న తెలుగుదేశం పార్టీ అప్పట్లో ప్రతిపక్షంలో వున్న వైకాపా ఎమ్మెల్యేలతో మైండ్‌గేమ్ అడి ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడానికి వ్యూహం రచించింది. ఈ వ్యూహం అమలు చేసిన అప్పటి అధికార తెలుగుదేశం పార్టీ పలమనేరు నుండి వైకాపా ఎమ్మెల్యే అమరనాధరెడ్డిని తమ పార్టీలో చేర్పించుకొంది. అలాగే పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌ను పార్టీలో చేర్పించడానికి వ్యూహం రచించినా చివరి నిముషంలో అది విఫలమైంది. అప్పట్లో రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలో వుండటంతో ప్రతిపక్షంలో వున్న వైకాపా ఎమ్మెల్యేలను తమవైపుకు ఆకర్షించడం పెద్ద పని కాదని అందరు భావించారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. రాష్ట్రంలో గత మూడున్నర సంవత్సరాలుగా వైకాపా అధికారంలో వుండగా ప్రతిపక్ష స్థానంలో తెలుగుదేశం పార్టీ వుంది. మూడున్నర సంవత్సరాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా నుండి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు మినహా మిగిలిన 13 స్థానాల్లో వైకాపా ఎమ్మెల్యేలు విజయం సాధించారు. రాష్ట్రంలో గత మూడున్నర సంవత్సరాలుగా జరిగిన పలు ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ చతికిలపడటం, అదే సమయంలో అదికారంలో వున్న వైకాపా ప్రతి ఎన్నికల్లో విజయం సాధించడంతో జిల్లాలో ఇక తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందని అందరు భావించారు. ఈ పరిస్థితుల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రావడం, ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు రాష్ట్రంలో జరిగిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడంతో మళ్ళీ తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం వచ్చింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుకు అవసరమైన ఎమ్మెల్యేల సంఖ్య ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి లేకపోయినా పార్టీ అభ్యర్థితో నామినేషన్ వేయించింది. తెలుగుదేశం అధిష్టానం అధికార వైకాపా ఎమ్మెల్యేలతో మైండ్ గేమ్ ఆడి ఇద్దరు వైకాపా ఎమ్మెల్యేలను తమవైపుకు తిప్పుకొని ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ స్థానంలో విజయం సాధించింది. ఈ విజయంతో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి మళ్ళీ మరింత ఊపు వచ్చింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ వైపు అధికార వైకాపాలో అసంతృప్తిగా వున్న 16 మంది ఎమ్మెల్యేలు మద్దతు పలుకుతారని తెలుగుదేశం ప్రకటించడంతో వైకాపా అధిష్టానం తమ పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష తెలుగుదేశం వైపుకు మళ్ళకుండా పక్కా చర్యలు తీసుకొంది. అయినప్పటికీ ఇద్దరు వైకాపా ఎమ్మెల్యేలు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించారు. ఈ సంఘటన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో మరింత ఊపు తెచ్చింది. ఈ పరిస్థితుల్లో అధికార వైకాపాలో అసంతృప్త ఎమ్మెల్యేలు తమ వైపుకు రావడానికి సిద్దంగా వున్నారని, అది రోజుల్లో కావచ్చు లేదా ఎన్నికల ముందు రావచ్చునని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని సంచలన వాఖ్యలు చేశారు. ఈ వాఖ్యలతో అధికాపా వైకాపా నుండి తెలుగుదేశం పార్టీకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఎవరనే విషయంపై సర్వత్రా చర్చ ప్రారంభమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 14 మంది ఎమ్మెల్యేలు వుండగా అధికార వైకాపాకు 13 మంది ఎమ్మెల్యేలు వున్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన ఎం.పి. రెడ్డెప్ప

రామకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



స్థానిక డా॥ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆదివారం చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ సందర్శించారు. పాఠశాలలో ఉన్న వసతులు, విద్యాబోధనపై ఆరాతీశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు క్రీడా సామగ్రి కావాలని వారిని కోరగా వెంటనే పదివేల రూపాయలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మన్సూర్ అలీ, పిడి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టిన సిఎం వైఎస్ జగన్

– జిడినెల్లూరు 'దేశం' కన్వీనర్ భీమినేని చిట్టిబాబు

పాలసముద్రం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



సిఎం వైఎస్ జగన్ నిరుద్యోగుల నెత్తిన మూడున్నర సంవత్స రాలుగా కుచ్చుటోపి పెట్టారని జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ భీమినేని చిట్టిబాబు అన్నారు. పాలసముద్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా వున్న 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ కోసం ప్రతి ఏడాది జనవరి 1వ తేదీ జాబ్ క్యాలెండర్ జారీ చేసి భర్తీ చేస్తామని చెప్పిన సిఎం ఇప్పటి వరకు ఒక్క జాబ్ సైతం భర్తీ చేయలేదన్నారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రాక, కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో నిరుద్యోగుల భవిత ప్రశ్నార్థకం అయ్యిందన్నారు. గత మూడేళ్ళలో రాష్ట్రంలో 21,575 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు రాక ఆత్మహత్యకు పాల్పడ్డారని పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి ప్రకటించడంతో రాష్ట్రంలో పరిస్థితి ఏమిటనే విషయం తెలుస్తోందన్నారు. సిఎంఐఇ నివేదిక ప్రకారం 2019లో 4 శాతంగా వున్న నిరుద్యోగిత ప్రస్తుతం 7.7 శాతంకు చేరిందని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంతో ఐదేళ్ళలో రెండుసార్లు డిఎస్సీ నిర్వహిస్తే ఈ ప్రభుత్వం మూడున్నర సంవత్సరాలుగా ఒక్క డిఎస్సీ సైతం నిర్వహించలేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, కోశాధికారి విజయకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబశివన్, వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షల పరిశీలకులను కలిసిన వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు

చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



జిల్లాకు టెన్త్ పరీక్షల పరిశీలకులుగా విచ్చేసిన విద్యాశాఖ సర్వీసెస్ జెడి మువ్వా రామలింగంను ఆదివారం రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎఫ్ అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి కలిశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ సర్వీసెస్ జెడి మువ్వా రామలింగంను కలిసిన రెడ్డి శేఖర్ ఆయనతో మాట్లాడుతూ గత ఏడాది టెన్త్ పరీక్షల నిర్వహణలో అభియోగాలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలన్న ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఈ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం లేదా వారి పాఠశాలల్లో వుండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు సరోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేటినుంచి పదవ తరగతి పరీక్షలు

– ఏకాగ్రతతో రాస్తే పరీక్షల్లో విజయం తథ్యం

కుప్పం, ప్రభాతవార్త

భవిష్యత్తుకు బంగారు బాట వేసుకునేందుకు మొదటిమెట్టుగా భావించే పదవ తరగతి పరీక్షలు నేటినుంచి ఆరంభం కానున్నాయి. పరీక్షల కోసం వేలాది మంది విద్యార్థులు రేయింబగళ్లు శ్రమించి ఎంతో సాధన చేసి పరీక్షల్లో విజయం సాధించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే ఈ పరీక్షల సమయంలో ముఖ్యంగా విద్యార్థులకు ఉండాల్సింది ఏకాగ్రత. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం ఉంటే విద్యార్థులు సులువుగా లక్ష్యాలను సాధించవచ్చు. ముఖ్యంగా పరీక్ష హాలుకు నిర్ణీత సమయం కంటే అర్థగంట ముందే చేరుకుని తమకు కేటాయించిన పరీక్ష హాలును సరిచూసుకోవాలి. తమ వెంట విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, అవసరమైన పెన్నులు, స్కేళ్లు తదితరాలు అందుబాటులో ఉంచుకోవాలి. పరీక్షల హడావుడిలో భోజనాలు తినకుండా పరీక్షలు రాయడం మాత్రం మంచిది కాదు. తగు ఆహారం తీసుకుని మనసును ప్రశాంతంగా ఉంచుకుని పరీక్షలకు హాజరు కావాలి. మొదట ప్రశ్నాపత్రం అందించగా సరి చూసుకోవాలి. ఆన్సర్ షీట్లు ఇవ్వగానే తొలుత హాల్ టికెట్ నెంబర్లు నమోదు చేసుకోవాలి. జవాబులు రాసేముందు ముందుగా తమకు సమాధానాలు బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాసి అనంతరం మిగతా వాటిపై దృష్టి పెట్టవచ్చు. తద్వారా కాసింత ఒత్తిడి తీరుతుంది. చివరగా సమాధాన పత్రాలు ఇన్విజిలేటర్లకు అందించే సమయంలో ప్రశ్నాపత్రాల్లో హాల్ టికెట్ నెంబర్లు, రాసిన సమాధానాలు, బుక్‌లెట్ పేపర్లు తదితరాలు సరిచూసుకోవాలి. ప్రశ్నాపత్రాల్లో గల అన్ని ప్రశ్నలకు సమాధానాలు తెలిసిఉంటే రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. ముఖ్యంగా ప్రశ్నల నెంబర్లు, జవాబులు విధిగా నమోదు చేయాలి. పరీక్షలనే ఫోబియాను విడనాడి ధైర్యంగా ఎదుర్కొంటే ఉత్తమమైన ఫలితాలు సాధించవచ్చు. ఆల్‌ది బెస్ట్ టెన్త్ విద్యార్థులు.. భవితకు బంగారు బాటవేసేందుకు శ్రీకారం చుట్టండి.

## వైకాపా పాలనలో ప్రజలకు ఇదేం ఖర్మ - తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



వైకాపా పాలనలో ప్రజలు ఇదేం ఖర్మ అంటున్నారని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అడవిబూదుగూరు పంచాయతీలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల వైకాపా పాలనలో అన్ని వర్గాల ప్రజలు చితికిపోయారన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగాయన్నారు. అలాగే చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేవన్నారు. ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదన్నారు. రాష్ట్రాన్ని అవినీతిమయంగా మార్చేశారన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు పట్టం కట్టాలని కోరారు. ఈసందర్భంగా పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా గణేష్, యువత అధ్యక్షుడిగా శివకుమార్, ప్రధాన కార్యదర్శులుగా విజయలింగం, రవి, యూనిట్ ఇన్‌చార్జ్‌లుగా బాలకృష్ణ, కృష్ణమూర్తిలను ఎన్నుకున్నారు. మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రామచంద్ర, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నేతలు సిద్ధప్ప, చిట్టిబాబు, దామోదర్, రమేష్, కార్తీక్, ప్రకాష్, రాజ్‌కుమార్, రాజేంద్ర పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సోమవారం ఉదయం 9.30లనుంచి మధ్యాహ్నం12.45గం.ల వరకు పరీక్షలు జరగనున్నాయి. కుప్పం మండలంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి తొమ్మిది కేంద్రాలను ఏర్పాటుచేశారు. కుప్పం పట్టణంలోని ఆర్.పేట, బాలుర, బాలికల హైస్కూళ్లు, విజయవాణి స్కూల్, చందం హైస్కూల్, నడిమూరు ఎపి మోడల్ స్కూల్, పైపాళ్యం, పొన్నాంగూరు, అడవిబూదుగూరు జడ్పీ హైస్కూళ్లలో సెంటర్లను ఏర్పాటుచేశారు. మొత్తం 1863మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

**వి.కోట :** మండలంలో పదో తరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 1226మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వి.కోట బాలుర హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, బాలికల హైస్కూల్‌లో ఒకటి, ఇన్‌ఫాంట్ జీసస్ స్కూల్, గోనమాకులపల్లి, కుంబార్లపల్లి పాఠశాలల్లో మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

## విద్యార్థులు సమాజసేవలో భాగం కావాలి

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్

కుప్పంరూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలో భాగం కావాలని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ సూచించారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో లయన్స్ క్లబ్ అధ్వర్యంలో నూతనంగా లియో ఫ్యూచర్, లియో అమిగోస్ క్లబ్‌లను ప్రారంభించారు. ఈ క్లబ్‌లద్వారాగ్రామీణప్రాంతప్రజలకుసేవలుఅందించాలని సూచించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా విద్యార్థుల్లో సేవా గుణం పెంపొందించాలనేది ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వినూత ప్రకాష్, నాగరాజురావు, చంద్రారెడ్డి, జ్యోతిరామన్, సుధారెడ్డి, రాజేష్, గంగాధర్, రాజారెడ్డి, మాధవన్, లయన్స్ క్లబ్ బృందం సత్యేంద్రశేఖర్, సోమశేఖర్, సెంథిల్, పిజి సెల్వం, శివకుమార్, ఆజాద్, ప్రసాద్, శివ, హరికృష్ణ, సురేష్, దివాకర్, ప్రకాష్ పాల్గొన్నారు.

## కేంద్రం పథకాలకు రాష్ట్రం పేరు చెప్పుకుంటారా - బిజెపి నేతలు

కుప్పంరూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం పేరు చెప్పుకోవడం దారుణమని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, రాజసింహ, కుప్పం కన్వీనర్ శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం కుప్పంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బిజెపి పొత్తు జనంతోనే ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. ఏప్రిల్ 17 నాటికి బూత్ కమిటీలు ఏర్పాటుచేస్తామన్నారు. సమావేశంలో భాజపా నేతలు ఆంజనేయులు, వడివేలు, రామచంద్ర, కాశీనాథ్, వెంకటేష్, వీర రాఘవనాయుడు, బిజె రామకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

శాంతిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



మండలంలోని మఠం గ్రామంలో డా॥ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా జెపి ఫౌండేషన్ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇప్పటికే ఫౌండేషన్ అధ్వర్యంలో మండలంలో పలుచోట్ల అంబేద్కర్ విగ్రహాలు ఇవ్వడం జరిగిందన్నారు. శాంతిపురంలో పేదలకు ఉచితంగా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమంను జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి, ఎంపిటిసి, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ఎన్టీఆర్ ట్రస్ట్‌చే మెగా వైద్య శిబిరం

**రామకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త** ఎన్టీఆర్ ట్రస్ట్‌చే సోమవారం కుప్పం పిఇఎస్ ఆస్పత్రి వైద్యులచే రామకుప్పంలోనిశ్రీసుబ్రమణ్యస్వామిఆలయంవద్దఉచితమెగావైద్య శిబిరం జరుగుతుందని తెలుగుదేశంపార్టీ నేతలుతెలిపారు. వైద్య శిబిరంకు హాజరయ్యే వారు రేషన్, ఆధార్‌కార్డు నకళ్లతో హాజరు కావాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నిరుద్యోగులను నట్టేట ముంచిన సిఎం జగన్

– ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు ఆరోపణ

చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ మూడున్నర సంవత్సరాల పాలనలో నిరుద్యోగులను నట్టేట ముంచారని ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా వున్న 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ కోసం ప్రతి ఏడాది జనవరి 1వ తేదీ జాబ్ క్యాలెండర్ జారీ చేసి భర్తీ చేస్తామని చెప్పిన సిఎం ఇప్పటి వరకు ఒక్క జాబ్ సైతం భర్తీ చేయలేదన్నారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రాక, కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో నిరుద్యోగుల భవిత ప్రశ్నార్థకం అయ్యిందన్నారు. గత మూడేళ్ళలో రాష్ట్రంలో 21,575 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు రాక ఆత్మహత్యకు పాల్పడ్డారని పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి ప్రకటించడంతో రాష్ట్రంలో పరిస్థితి ఏమిటనే విషయం తెలుస్తోందన్నారు. సిఎంఐఇ నివేదిక ప్రకారం 2019లో 4 శాతంగా వున్న నిరుద్యోగిత ప్రస్తుతం 7.7 శాతంకు చేరిందని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంతో ఐదేళ్ళలో రెండుసార్లు డిఎస్సీ నిర్వహిస్తే ఈ ప్రభుత్వం మూడున్నర సంవత్సరాలుగా ఒక్క డిఎస్సీ సైతం నిర్వహించలేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, దేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు

## మే 1 నుండి భజరంగదళ్ శిక్షణ తరగతులు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



నెల్లూరులో మే 1 నుండి 7వ తేదీ వరకు బజరంగదళ్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర భజరంగదళ్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు ఈశ్వరగుడి వీధిలోని శ్రీరామకృష్ణ ఆశ్రమంలో ఆదివారం జిల్లా విశ్వ హిందుపరిషత్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా విశ్వ హిందు పరిషత్ ఉపాధ్యక్షుడు హరిబాబు అధ్యక్షత వహిస్తే ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో దేశ, దైవభక్తి పెంపొందించడానికి భజరంగదళ్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి వార్డు, గ్రామంలో విశ్వహిందు పరిషత్, బజరంగదళ్ కమిటీలు వేసి హిందు సమాజ సంఘటితానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు నగర కమిటీ ఏర్పాటు అయ్యింది. నగరకమిటీఅధ్యక్షుడిగాధరణి, కార్యదర్శిగా బాలాజీ, కన్వీనర్‌గా హేమసూర్యలు ఎన్నికయ్యారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పక్కాగా అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. చిత్తూరు నగరం తేనెబండ పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా! లేదా! అని ఆరా తీశారు. ఒకవేళ ప్రభుత్వ పథకాలకు అర్హులుగా వుండి మంజూరు కాకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు వాటిని పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, లైట్లు, స్మశాన దారి, ఇంటి పట్టాలు, మంచినీటి బోరు తదితర సమస్యలను తీసుకువచ్చారు. వీటిని సత్వరం పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ గంగ, జిల్లా వైకాపా మహిళా అధ్యక్షురాలులీనారెడ్డి, వైకాపా నాయకులు త్రిమూర్తి, నరేష్, కుమార్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత మహిళల్ని ఆస్పత్రిలో పరామర్శించిన తెలుగుమహిళ నేతలు

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



వైఎస్సార్ ఆసరా సభకు వెళ్తూ రామకుప్పం మండలంలో టెంపో బోల్తా పడడంతో గాయాలపాలై పిఇఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను ఆదివారం చిత్తూరు జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, జిల్లా ఉపాధ్యక్షురాలు సుగుణమ్మ, మండల అధ్యక్షులు పద్మమ్మ, శ్యామల, హేమసుబ్బమ్మ, రూప తదితరులు పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలకు సరైన చికిత్స లేక వారు ఇబ్బందులు పడుతుంటే వైకాపా నేతలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బాధితులకు ఇంటికి వెళ్లాలని ఆస్పత్రి సిబ్బంది సూచిస్తున్నారన్నారు. ఈసందర్భంగా బాధిత మహిళలకు బ్రెడ్, పళ్ల రసం అందించారు. మహిళలకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## తహశీల్దార్‌గా మళ్లీ జెజె రావు

తడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



తడ మండల తహశీల్దార్‌గా జెజె రావును నియమించారు. ఆయన ఇంతకుముందు ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గాను, కొంతకాలం తహశీల్దార్‌గాను పనిచేశారు. ఇక్కడ తహశీల్దార్‌గా ఉన్న బి.రామయ్య పెళ్లకూరు మండలానికి బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న జెజె రావు తడకు నియమితులయ్యారు. నూతన తహశీల్దార్ జెజె రావుని కార్యాలయ సిబ్బంది, పలువురు విఆర్‌ఓలు ఘనంగా స్వాగతించారు. ఈ ప్రాంతం వారికి చిరపరిచితులు కావడంతో ఆయనను పలువురు అభినందించారు.

## శ్రీహరికోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ

శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 2 ప్రభాతవార్త



జాతీయ ఉపకార వేతనానికి శ్రీహరికోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.హేమసాయిశ్రీ ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ 2023 పరీక్షల్లో ఆమె అత్యున్నత ప్రతిభ కనబరిచారు. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోటలో చదువుతున్న హేమసాయిశ్రీ జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించారు. 8వ తరగతి చదువుతున్న ఆమె ప్రతిభ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, ఇతర ఉపాధ్యాయులు కొనియాడారు. హేమసాయిశ్రీకి నాలుగేళ్ల పాటు ఏడాదికి 12 వేల రూపాయలు స్కాలర్‌షిప్ అందుతుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

## ఎండియు ఆపరేటర్ల సమ్మె విరమణ

– నేటి నుంచి గడప గడపకు బియ్యం పంపిణీ – డిఎస్ఓ ఎంవి ప్రసాద్

కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

జిల్లాలోని ఎండియు ఆపరేటర్లు సమ్మెకు దిగడంతో ఏప్రిల్ 1 నుంచి ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఎండియు ఆపరేటర్ల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరపడంతో ఆపరేటర్లు సానుకూలంగా స్పందించారని తిరుపతి జిల్లా డిఎస్ఓ ఎంవి ప్రసాద్ తెలిపారు. ఆయన ఆదివారం 'ప్రభాతవార్త'తో ఫోన్‌లో మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించేందుకు ముందుకు వచ్చిందని, ఇందుకు ఆపరేటర్లు కూడా అంగీకరించారని చెప్పారు. దీంతో వారు సమ్మె విరమించారని తెలిపారు. తిరుపతి జిల్లాలో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ఎండియు వాహనాల ఆపరేటర్లు గడప గడపకు బియ్యం పంపిణీ చేస్తారని తెలిపారు.

## ఎండియు ఆపరేటర్లకు డీలర్లు సహకరించడం లేదు

కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని ఎండియు వాహనాల ఆపరేటర్లకు డీలర్లు సహకరించడం లేదని ఎండియు వాహనాల ఆపరేటర్లు ఆరోపిస్తున్నారు. వెంకటగిరిలో డీలర్లు కాటా పెట్టి బియ్యం బస్తాలను ఎండి ఆపరేటర్లకు ఇస్తుంటే, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని డీలర్లు అలా ఇవ్వకుండా ఎండియు ఆపరేటర్లపైనే భారం వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వపరంగా సమ్మెను తాము విరమించుకున్నా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని డీలర్ల వల్ల తాము మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

## పురస్కార గ్రహీతకు అభినందనలు

కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో గ్రంథాలయ అధికారి పి.రామిరెడ్డి ఐపిఎస్ఎస్ఆర్ నేషనల్ సెమినార్‌లో పరిశోధన వ్యాసానికి ఉత్తమ పురస్కారం పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రమంలోనే రామిరెడ్డిని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

## కోటమ్మ తల్లికి వెండి కిరీటం బహూకరణ

కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం చెన్నైకి చెందిన దామోదరం, ముత్తుకుమార్, ప్రియ కలిసి వెండి కిరీటం బహూకరించారు. ఈ కార్యక్రమం ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

## చల్లబడిన వాతావరణం

కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

గత కొన్నిరోజులుగా భానుడి తాపానికి విలవిల్లాడిన మండల ప్రజలు ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంచల్లబడటంతోఊపిరిపీల్చుకున్నారు. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఊరట లభించింది. ఇళ్లలో ఉండలేక, బయట చెట్లకింద సేదతీరే వారికి ఈ చల్లటి వాతావరణం ఎంతగానో ఊరటనిచ్చింది.

## పరీక్షల సమయంలో జిరాక్స్ షాపులు తెరవద్దు

– నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు – ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి

ఓజిలి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



మండల పరిధిలోని ఓజిలి, చిలమానుచేను 10వ తరగతి పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు, నెట్ సెంటర్లు తెరవవద్దని ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి సూచించారు. 10వ తరగతి పేపర్ల జిరాక్స్ కోసం ఎవరైనా వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ షాపులు, నెట్ సెంటర్లు ఉంటే ఆ షాపులను మూసేయాలని, 10వ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు మూసివేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నిబంధనలు అతిక్రమించినా, పరీక్షా కేంద్రాల్లో గుంపులుగుంపులుగా వచ్చినా చర్యలు తప్పవన్నారు.

## యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

– గూడూరు సెబ్ డిఎస్పీ జానకిరామ్

నాయుడుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని గూడూరు సెబ్ డిఎస్పీ జానకిరామ్ అన్నారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ సివి రామన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ క్రీడోత్సవాలలో గూడూరు సెబ్ డిఎస్పీ జానకిరామ్, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు క్రీడా జ్యోతిని వెలిగించి శాంతి కపోతాలను ఎగురవేసి క్రీడోత్సవా ర్యాలీని ప్రారంభించారు. క్రీడోత్సవాల్లో భాగంగా సెబ్ డిఎస్పీ జానకిరామ్ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉన్నతంగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిఐ ఆర్‌యువిఎస్ ప్రసాద్, సివి రామన్ కళాశాల డైరెక్టర్ ఖాదర్‌బాబు, ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపి, న్యాయవాదులు పసల గంగాప్రసాద్, జివిఆర్ కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో భారీవర్షం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులు ఈ దురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో సక్రమమైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై వర్షపు నీరు చేరింది. ఆర్‌అండ్‌బి రోడ్డుపై నీరు చేరుకుంది. వాహనదారులతో పాటు పాదచారులు కూడా ఇబ్బందులు పడ్డారు. రూరల్ పరిధిలో ఆంబెట్టిన మిరపకాయలు వర్షంలో తడిసిపోయాయి. ప్రస్తుతం కురిసిన అకాలవర్షంతో వేరుశనగ రైతులు, మామిడి రైతులకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయి.

## తిమ్మనగారిపాలెంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

చిల్లకూరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త



మండలంలోని తిమ్మన్నగారిపాళెం గ్రామంలో ఏర్పాటు అయి వున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రామ కమిటి కన్వీనర్ శివా జోగి ఆనంద్‌బాబుల ఆద్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గిద్దలూరు సుమలత, ఉపసర్పంచ్ భూసరెడ్డి, రాధాకృష్ణారెడ్డి సహకారంతో పోటీలు నిర్వహించడం జరుగుతుంది ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతు ఈనెల 14 వ తేది అంబేద్కర్‌జయంతిని పురస్కరించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కులామతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో పోటీలు ప్రారంభించడం జరిగిందని చెప్పారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిదులుగా దేశిరెడ్డి వంశీదర్‌రెడ్డి, బూసారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గిద్దలూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ బెంచీలు వితరణ

చిల్లకూరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త



మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం గూడూరు పట్టణానికి చెందిన ప్రగతి సేవ సంస్థ ఆద్వర్యంలో దాతలు రమేష్ బీకరి అదినేత రమేష్ , యమహాసుబ్రమణ్యం, ఆర్ ఆర్ ప్రభాకర్‌రెడ్డి, జిజి నాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి సహకారంతో పది సిమెంట్ బెంచీలను ఆలయ ఇఒ కె నవీన్ కుమార్‌కి అందించారు. అనంతరం వారు మాట్లాడుతు ఎంతో ప్రముఖ్యమైన తల్లి ముత్యాలమ్మ అమ్మవారు అనిఅమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని భక్తుల సౌకర్యార్థం ఈ సిమెంట్ బెంచీలు ఇవ్వడం సంతోష దాయకమని అన్నారు. ఈకార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ కమీటి సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రగతి సేవా సంస్థవారు చంద్రశేఖర్, కాటారి శ్రీనివాసులు, రవికుమార్, మామూడూరు రాదయ్య, ఆర్‌ఆర్ ప్రభాకర్, శివకుమార్‌రెడ్డితోపాటు మరికొంతమంది పాల్గొన్నారు.

## దిగువమత్త్యంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం

తవణంపల్లె, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆద్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదివి ఆత్మజ్ఞానులు కావాలని త్రైత సిద్ధాంతం ఇందూ జ్ఞానవేదిక-ప్రబోధ సేవాసమితి, బంగారుపాళ్యం–2 కమిటీ అధ్యక్షుడు పుల్లూరు ధనంజయ అన్నారు. ఆదివారం సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం–2 సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, మనపండుగలు, సంప్రదాయ గ్రంథాలు మండలంలోని దిగువమత్త్యం ఎస్సీ వాడలో ఇందూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ అనే పదానికి అర్థంను వివరించారు. జీవుడుజన్మలులేనివాడైదేవునిలో ఐఖ్యం కావడమే శ్రీరామ అనే పదానికి అర్థమని తెలిపారు. ఈకార్యక్రమంలో సభ్యులు పుల్లూరు ధనంజయ, ముని రత్నం, చంద్రబాబు, చటర్జి, హర్షవర్ధన్ కిరణ్, ఈశ్వర్, చిట్టెమ్మ, లత, చాముండీ, లలిత, విమల, శాంతమ్మ, సరళాదేవి, జ్యోతీశ్వరి, సుస్మితపాల్గొన్నారు.

## రెండు పరీక్షా కేంద్రాలు 428మంది విద్యార్థులు

చౌడేపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

టెన్త్ పరీక్షలను పగడ్బంధీగా నిర్వహించనున్నట్లు ఎంఇఓ కేశవరెడ్డి తెలిపారు. మండలవ్యాప్తంగా గల ఉన్నతపాఠశాలల నుంచి 428మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారనీ, వారందరికీ స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో 2కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎ.కేంద్రంలో 180మంది, బి.కేంద్రంలో 248మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చామనీ, వేసవిని దృష్టిలో వుంచుకొని మంచినీరు, వైద్య, పోలీసు సిబ్బంది ఏర్పాటు చేశామని వివరించారు. అదే విధంగా ఓపెన్ టెన్త్ పరీక్షలు సైతం స్థానిక ఉన్నతపాఠశాలలో మధ్యాహ్నం నుంచి ప్రారంభమవుతాయన్నారు.

## నేడు స్పందన

చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమీషనర్ డాక్టర్ జె.అరుణ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకొంటే కమీషనర్ పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటారు.

# మండలంలో బృందమ్మ పలకరింపులు-పరామర్శలు



తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

మండలంలో ఆదివారం దివంగ తనేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీ మణి బొజ్జలబృందమ్మ మండలంలో మృతిచెం దిన వారి కుటుంబ సభ్యు లను పరామర్శించడంతో పాటు అనారోగ్యానికి గురైన వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని తామున్నామంటూ భరోసా కల్పించారు. ఆదివారం మండలంలోని ఇలగనూరు పంచాయితీకి చెందిన తెలుగు దేశంపార్టీ సీనియర్ నాయకులు చిన్నస్వామి నాయుడు కర్మక్రియలకు దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ హాజరై చిన్నస్వామినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కొణతనేరి పంచాయతీ గుర్రప్పనాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన లెక్కల మునిరత్నంయుడు అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలో అమర ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగ్రామినికి చేరుకున్న ఆయన్ను ఇంటికి వెళ్ళి పరామర్శించారు. సీనియర్ పార్టీ నాయకులు చెరుకూరు వెంకటరామానాయుడు అనారోగ్యానికి గురవడంతో ఆయన్ను పరామ ర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళీ నాయుడు,మాజీ పాలసొసైటీ ఛైర్మన్ రావిళ్ళముని రాజనాయుడు, మాజీ సర్పంచ్ శంకర్‌నాయుడు, లక్ష్మయ్యనాయుడు, భాస్కరయ్య, బోనుపల్లి మాజీ సర్పంచ్ రామానాయుడు, లక్ష్మమ్మ, ఇలగనూరు మాజీ సర్పంచ్ మధునాయుడు, మునిరత్నం, మాజీ జడ్పీటిసి సుబ్బ రామయ్య, పెంచలయ్య, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, మల్లీశ్వరి, రేణుకమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి టి.సుబ్రమణ్యం, మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌నాయుడు, విజయ్, శంకర్‌నాయుడు, నితీష్, జగదీష్, హేమంత్, కుప్పయ్య, గురవయ్య, రమేష్‌నాయుడు, శోభ, జ్ఞానేందర్, పవన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి - డాక్టర్ రవిబాబు

రేణిగుంట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



మహిళలు మగవారితో సమానంగా సంపాదించి ఆర్థిక సాధికారత సాధించాలని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ డా. మర్దాల రవిబాబు అన్నారు. రేణిగుంట మండలం దిగువ మల్లవరం ఎస్సీ కాలనీకి చెందిన పేద మహిళ భారతికి ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆదివారం కుట్టు మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ వ్యవసాయంలో యంత్రాలు రావడంతో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. చాలా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారికి సాయం చేయడానికి ఆకాంక్ష నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగా కుట్టు మిషన్ అందజేసినట్టు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి చిన్న చిన్న చేతి వృత్తులు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ సలహా దారు పేరం రాధిక కిరణ్, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా లోకేష్ బాధ్యతలు స్వీకరణ

వెదురుకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :



వెదురుకుప్పం ఎస్ఐగా లోకేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ గోపి బదిలీ పై తిరుపతి జిల్లా వెళ్ళడం జరిగింది. ఎస్పీ ఉత్తర్వుల మేరకు లోకేష్ బాధ్యతలు చేట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటు శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. మండల పరిస్థితులు స్థితిగతులు తెలుసుకుని శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తానని స్పష్టం చేశారు.

ఫోటో :

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్ఐ

వెదురుకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :

మండలంలోని పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్ష కేంద్రంను ఆదివారం ఎస్ఐ లోకేష్ పరిశీలించారు. సెంటర్‌లో పరీక్ష రాయడంకు వచ్చే విద్యార్థుల వసతులను పర్యవేక్షించారు. పచ్చికాపల్లం పదవ తరగతి పరీక్షల నిర్వహకులుకరుణ నవనీతం, పార్వతిదేవిలతో పరీక్షల నిర్వహణ పై చర్చించారు.కేంద్రంలో పరక్షలు రాసే విద్యార్థులకు కావలసిన మౌలిక వసతుల కల్పనను ప్రశ్నించారు. పరీక్షలు ప్రారంభం నుంచి పూరి అయ్యేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.ఆయనతో సిబ్బంది స్వామి రెడ్డి పాల్గొన్నారు.

## అంకాళమ్మకు ముక్కుపుడుక వితరణ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధి లోని పాత వరదయ్యపాళెం రోడ్డులో వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తున్న అంకాళమ్మ తల్లికి బహుమా నాలు విరివిగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం గూడూరు లోని పిడతలపూడి గ్రామానికి చెందిన బండిలక్ష్మీ, బండి ప్రభాకర్‌లు రెండున్నర సవర్ల బంగారు ముక్కుపు డకను అందించారు. ఈ బహుమానాన్ని బోర్డు సభ్యు డుజి. ఈశ్వరరావు, ఎన్.రా జశేఖ ర్ రావులకు అదించారు. వారికి అమ్మవారు ఆయురారోగ్యాలు అ ందించాలని పూజలు జరిపి ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో సభ్యులు మరాఠిపాళెం వాస్తవ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత బియ్యం పంపిణి

శ్రీకాళహస్తి రూరల్ ఏప్రిల్ 2 ప్రభాతవార్త




శ్రీకాళహస్తికి చెందిన యువనేస్తం విద్యార్థులకు ప్రతినెల అందించే ఉచిత బియ్యంను ఆదివారం అందించారు. శ్రీకాళహస్తి మండ లం రామాపురం ఎస్‌టి కాలనీ, భైరవ కాలనీలో యువనేస్తం అసోసియేషన్ సారధ్యంలో బియ్యా న్ని అందిస్తున్నారు. యువనేస్తం సార ధ్యంలో సాయంత్రం బడు లకు హాజరౌతున్న పిల్లలకు ప్రోత్స హాకం గా ఉచితంగా ఒక్కొక్కరికి నెలకు సరిపడ్డ 3కిలోల బియ్యాన్ని అందిస్తున్నామని వివరించారు.యువనేస్తం ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు వినోద్ సహాయంతో అందించారు. అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్, నాగమణి,స్రవంతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుసాహితి సభకు వరదయ్యపాళెం కళాకారునికి ఆహ్వానం

వరదయ్యపాళెం,ఏప్రిల్ 2 ప్రభాతవార్త



అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక,సామాజిక,సేవాసంస్థ అయిన శ్రీ శ్రీ కళావేదిక చైర్మెన్ డాక్టర్ కత్తిమండప్రతాప్ సారధ్యంలో ఈనెల 9,10తేదుల్లో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించే బ్రహ్మోత్స వాలకు వరదయ్యపాళెం మండలానికి చెందిన ఉపాధ్యాయుడు,కళాకారుడు పోలూరు జగన్నాధంకు ఆహ్వానం లభించింది. దాంతో పలువురు జగన్నాధంను అభినందించారు. ఈ సందర్భంగా జగన్నాధం మాట్లాడుతు ప్రపంచ కవిత్రోత్స వం సాహితి సదస్సు లు,కళాప్రదర్శనలు,పుస్తకావిష్కరణలు వంటి అంశాలతో వరల్డ్ రికార్డు నెలకొల్పునున్నట్లు తెలిపారు. ఈ ఆహ్వానం పట్ల మండలంలోని ప్రముఖులు ఉపాధ్యాయులు జగన్నాధంను అభినందించారు.

## డ్వాక్రా బజార్‌ను సందర్శించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుచానూరు,ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ,సెర్ప్,డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన పార్టీ ముఖ్య నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తనకు నచ్చిన కాటన్ దుస్తులు,ఆయుర్వేద మూలికలతో తయారు చేసిన ఔషధాలు,చెక్క బొమ్మలను కొనుగోలు చేశారు. ఏపితో పాటు తమిళనాడు,కర్నాటక,కేరళ, మహారాష్ట్ర,ఒరిస్సా రాష్ట్రాల నుండి విక్రయదారులు తమ ఉత్పత్తులను అమ్మకానికి పెట్టినట్లు తెలుసుకున్న ఆయన వాటన్నింటినీ పరిశీలించారు. ఈ సందర్శనలో ఎమ్మెల్యేతో పాటు,డిఆర్‌డిఏ ఏపిడి ప్రభావతి,ఇతర అధికారులు ఉన్నారు.

## తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

-బస్‌స్టేషన్ ఏటిఎం డి.రామచంద్రనాయుడు

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

ఈనెల 5వ తేదీ బుధవారం పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ కోసం వేలాది మంది భక్తులు అక్కడికి వెళ్లడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రయాణీకుల సౌకర్యార్థం ఏపిఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డి.రామచంద్రనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలియచేశారు.జిల్లాలోని వివిధ డిపోలకు చెందిన బస్సులు తిరుపతి,వెంకటగిరి,వాకాడు,సూళ్లూరుపేట, సత్యవేడు,పుత్తూరు తదితర ప్రాంతాల నుండి ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి అర్ధ గంటకు ఒక బస్సు బయలుదేరుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సర్వీసులో ప్రతి బస్సుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని,ప్రజలు తమ మొబైల్ ఫోన్ నుండి కానీ,ఆయా బస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద కానీ అప్ అండ్ డౌన్ కోసం టికెట్లను రిజర్వేషన్ చేసుకోవచ్చున్నారు.తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ నుండి ఎక్స్‌ప్రెస్,డీలక్స్,సూపర్ లగ్జరీ,ఏసి సర్వీసులు కూడా బయలుదురుతాయని ఆయన వివరించారు.ప్రయాణీకులు తమ సౌకర్యవంతమైన ప్రయాణం కోసం రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు.ప్రయాణీకులు తగు సూచనలు,సలహాల కోసం 9959225684/ 9959225686 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఏటిఎం డిఆర్.నాయుడు తెలిపారు.

## విద్యుత్ చార్జీలు పెంచుతూ పోతున్న వైసీపీ సర్కార్

– గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

విద్యుత్ చార్జీలు 8 సార్లు పెంచారని, ఆర్టీసీ చార్జీలు 3 సార్లు పెంచారని, పెట్రోల్, డీజిల్ ధరల్లోఏపీ నెంబర్ వన్ అని, ఇంటి పన్ను రెట్టింపు చేశారని, చెత్త పన్ను, నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం నగరి మున్సిపాలిటీలోని ఏకాంబరకుప్పంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా వైసీపీ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, రజనికాంత్, పెరుమాళ్, చిత్తూరు పార్లమెంట్ సెక్రటరీ బాలాజీ, తనిగవాసన్, ఇళన్‌గోవన్, చంద్రశేఖర్, ఎం.ఎం.శేఖర్, జీవరత్నం, నీలమేఘం, తులసి లింగం, షణ్ముగం, మురళి, మాణిక్యం, బి.పి.ఆర్ముగం, గుణశేఖర్, జ్యోతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా ఉంటా - డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:




పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడానికి సిపాయి భరోసాను ప్రారం భించినట్లు ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. రేణిగుంటకు చెంది నక్కృష్ణమోహన్‌రెడ్డి కర్మక్రియ లు కోసం ఆదివారం సుబ్ర హ్మణ్యం సిపాయి భరోసాను అందజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ ఆర్థికంగా నిల తొక్కుకోవాలని ఆకాంక్షించారు. మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు 44 రకాల ఆహార ఫల సరకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుటుంబంలో సంపాదన పరుడు మరణించిన కుటుంబాలకు తనవంతు సహాయ అందజేయడానికి సిపాయి భరోసా పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. కుటుంబ సభ్యులు సదాశివారెడ్డి, రామిరెడ్డి, న్యాయవాది తిరుమలరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

## జైన్ సంఘం తరపున కంటి వైద్య శిబిరం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని ఎస్‌విఎస్ జైన్ సంఘం ప్రతి ఏడాది సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిం చారు. వారు తిరుపతి కార్పొరేట్ అరవింద్ ఆసుపత్రి సహాయ సౌజన్యంతో కంటి వైద్యపరీక్షలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జైన్ సంఘం అధ్యక్షులు కొఠారి రమేష్ మాట్లాడుతూ గతంలో ఏడాది ఒక సారి కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించే వారమన్నారు.అయితే చుట్టుపక్కల గ్రామాల నుంచి నిరుపేదలు ప్రతి నిత్యం శ్రీకాళహస్తిలోని కార్పొరేట్ ఆసుపత్రుల వద్ద కనబడుతున్నారని కాబట్టి ఇక మీదట ప్రతి నెల మొదటి ఆదివారం పేద ప్రజలకు సేవలందించేక్రమంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా నిర్వహించుటకు కమిటి తీర్మానించినట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.ఈకార్యక్రమాల్లో నేమిచంద్ గౌరవ్, వపన్ కుమార్, సుధీర్, విజయ్,మనోజ్, వికాస్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు. సేవలందించారు.శిబిరానికి స్థానిక డాక్టర్లు కూడా సహకరించారు.

# తిరుపతి డివిజన్

## జూన్ 1న షిరిడిసాయి పాలరాతి విగ్రహ ప్రతిష్ట

తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



మండలంలోని కాసరం పంచాయతీ రాంబట్లపల్లి గ్రామంలోని షిర్డి సాయిబాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ట మహోత్స వాన్ని జూన్ 1వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మాజీ సింగిల్ విండక్ష అధ్యక్షుడు, ఆలయ ధర్మకర్తల కె.మహదేవరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 30న మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, మండప ఆరాధన, వాస్తు హోమం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, ద్వారపూజ, రాత్రి హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందని 31న ఉదయం గణపతి పూజ, మండల దేవత ఆరాధన, కలశస్థాపన, రుద్ర ఆరాధన, రుద్రహోమం ఉదయం 10గంటలపైన షిరిడి సాయినాథుని విగ్రహ గ్రామోత్స వం మరియు మద్యాహ్నం 12గంటలకు హారతి, మంత్రపుష్పం తీర్థప్ర సాదాల వితరణ, జూన్ 1న గురువారం ఉదయం 5గంటలకు కలశారాధన, మూలమంత్ర హోమాలు, అనంతరం సాయినాథుని విగ్రహ ప్రతష్టాపన మహోత్స వంను గుడిమల్లం దేవస్థాన ముఖ్య అర్చకులు ప్రతిష్టాచార్యులుపణతులయోగేంద్రపవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. విగ్రహ ప్రతిష్టలో గ్రామానికి చెందిన వారే కాకుండా మండల ప్రజలు కూడా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## చిన్నారుల ఆకలితీర్చే సాధుస్వయంభువుస్వామి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



ఆయన ఓసాధువు. తొలుత ఆయన్న అంబలి స్వామి అని అనంతరం సాధుస్వయంభువుస్వామి అని పిలుస్తుంటారు. పట్టణంలోని భరద్వాజ తీర్థా నికి వెళ్ళే సమీపంలో ఓ చిన్న గోశాలను ఏర్పాటు చేసుకుని అందరికీ పాలు పంపిణీచేయడంతో పాటు తనకున్న దాంట్లో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఇది తెలుసుకున్న కొందరు దాతలు ఆత్మీయులు పుట్టినరోజులు, వర్ధంతులకు అన్నదానం చేయాలంటూ విరాళాలు అందించేవారు. దీంతో ఆయన పదిమంది నుంచి నేడు వందమందికిపై అన్నదానం చేస్తుంటారు. దాతలు అందించిన విరాళాలతో ఆశ్రమాన్ని నిర్మించి అందులోశివపార్వతుల విగ్రహాన్ని ఏర్పాటుచేసి నిరంతరం పూజలు చేస్తుంటారు. గోశాలను ఏర్పాటుచేసి గోవుల నుంచి వచ్చే పాలను ఆలయంలోని భక్తులతో పాటు భరద్వాజతీర్థంకు సమీపంలో ఉన్న కాలనీలో ఉంటున్న చిన్నారులకు పాలను పంపిణీచేసి వారి ఆకలితీరుస్తుంటాడు. ఆయనకాలనీకి వచ్చాడండే చిన్నారులందరు పరుగెత్తుకుని వెళ్ళి క్రమపద్దతిలో నిలబడి పాలుతీసుకోవడం విశేషం. ఏది ఏమైనా చిన్నారులు ఆకలితీర్చుతున్న సాధువస్వయంభువుస్వామిని అందరు అభినందిస్తున్నారు.

## శివయ్య సేవలో కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి తమిళనాడు,కర్నాటకలనుంచి అతిథుల తాకిడి పెరిగింది. కర్నాటకలో ఎన్నికల నగరా మోగటంతో నాయకుల రాక పెరిగింది. ఆదివారం కర్నాటక ప్రదేశ్ కమిటి అధ్యక్షులు డికె శివకుమార్ కుటుంబసభ్యులతో విచ్చేసారు.వారికి దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఆయన ఆలయంలో నిర్వహించే ప్రత్యేక రాహుకేతుదోష నివారణపూజలు జరిపించుకోవాలని కోరగా వెంటనే వారికి ఏర్పాట్లు చేసారు. సర్పదోష నివారణ పూజల అనంతరం వారికి అంతరాలయ దర్శనం ఏర్పాటుచేసారు. తరువాత గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి స్థానిక శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కార్యనిర్వహణాధికారి వికె సాగర్‌బాబు ఏర్పాట్లను టెంపుల్ ఇన్సె పెక్టర్ సుదర్శనం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి ఆయన తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డిలు వెంకటేశ్వరస్వామి దారుశిల్పాన్ని అందించారు.

## ముత్యాలమ్మ జాతరకు సన్నాహాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా ముత్యాలమ్మ గుడివీధి లో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో జాతరకు ఆలయాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనేపధ్యంలో ఆలయానికి నూతన శోభను సంతరించుకుంటోంది. ప్రతి ఏడాది ఎంతో అంగరంగ వైభంగా నిర్వహించే ముత్యాలమ్మ జాతర కొలుపు ఈనెల 4వ తేదీ మంగళ వారం నుంచి ప్రారంభం అవుతుంది. ఇదేరోజు ఉదయం 7గంటలకు గెరిగ ఉత్స వం, మైలుముగ్గ, శేషపాన్పుముగ్గ, 5వతేదీ బుధవారం ఉదయం పోతురాజు ముగ్గ, మద్యాహ్నం అన్నదానం, సాయంత్రం రేణుకాదేవి ముగ్గ, రాత్రి కుంభం, 6వ తేదీన ముత్యాలమ్మ ముగ్గ, రాత్రి 7గంటలకు అమ్మవారి గ్రామోత్స వాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, ఇఒ కెవి.సాగర్‌బాబులు తెలిపారు.

## విద్యార్థులకు అండగా ఉంటా - లక్ష్మీపతిరెడ్డి

రేణిగుంట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని సర్పంచ్ గానే కాక తన ట్రస్టు ద్వారా విద్యార్థులకు ఎప్పుడు అండగా ఉంటానని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి తెలిపారు. విప్పమానుపట్టెడ గ్రామ పంచాయతీలో వేమాపురం సంజీవ రెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ట్రస్టు అధ్యక్షులు, గ్రామసర్పంచ్ వి.లక్ష్మీపతిరెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ వారికి పరీక్షలకు సంబంధించిన విద్యా సామగ్రిని పంపిణీచేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని పిలుపునిచ్చారు. పంచాయతీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు ఉపాధ్యా యునినియమిస్తామనితెలిపారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రపంచ సాహితి బ్రహ్మోత్సవాలకు అంజనాద్రికి ఆహ్వానం

విజయపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :



ప్రపంచ సాహితి బ్రహ్మోత్స వాలకు మండలంలోని కేశవపురం గ్రామానికి చెందిన నంది పాగ అంజ నాద్రికి ఆహ్వానం లభించింది. శ్రీ శ్రీ కళావేదిక ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే కవితా గానంపాల్గొనేందుకు అవకాశం రావడం ఆనందంగా వుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అవకాశం కల్పించిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రెండెకరాల చెరకు తోట దగ్ధం

విజయపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :

మండలంలోని కాళికాపురంలో రెండు ఎకరాల చెరకు తోట దగ్ధమైందని రైతు పరశురామ్ తెలిపారు. పొలానికి సమీపంలో 33/11 కెవి విద్యుత్ లైన్ వల్ల ప్రమాదం జరిగిందా, ఎవరైనా నిప్పు అంటించారా తెలియడం లేదని వాపోయారు. చేతికి అందిన పంట నాశనమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఏర్పేడులో మెగా రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి రూరల్ ఏప్రిల్ 2 ప్రభాతవార్త



ఏర్పేడు మండల కేంద్రం లోని వెంకటగిరి రహదారి సమీపంలోని సంతమై దానంలో ఆదివారం యు వ సమాజ్ నిర్మాణ సంస్థ సారధ్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పా టు చేసారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఐదవ వార్షికో త్స వం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు పౌండర్ డాక్టర్ గానుగపెంట రమేష్, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడుతాళిక్కాల్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ శిబిరంలో తిరుపతికి చెందిన రుయా ఆసుపత్రి డాక్టర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది యువకులు రక్తదానం చేయటానికి ముందుకు రావటం అభినందనీయమని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమాల్లో సంస్థ సభ్యులు మోరస పవన్‌కుమార్,రాజేంద్ర, విజయ్, చిరంజీవి, లోకముని, శివకృష్ణ,భరత్,చందు,సమీర్,,లోకేష్, సంతోష్, రుయా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్‌కు చెందిన డాక్టర్ హర్షిత,షణ్ముగం, రవరికుమార్, వాహిని, టెక్నిషియన్లు రఘురాం చౌదరి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజు హంతకులను కఠినంగా శిక్షించాలి

-టిడిపి అధికారప్రతినిధి సుధాకర్‌రెడ్డి

తిరుపతి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాగరాజు(36)ను గంగుడుపల్లి సమీపంలో అతికిరాతకంగా హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని టిడిపి అధికారప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కారణం ఏమైనప్పటికీ రోడ్డుపై చంపి కారులో వేసి తగులపెట్టిన నేరస్తులను శిక్షించాలన్నారు.మృతుడు నాగరాజు భార్య సులోచన ఇతర కుటుంబసభ్యుల ఆరోపణలను పరిగణనలోనికి తీసుకుని పోలీసులుకేసు పెట్టాలని చెప్పారు. హత్య జరిగి ఒకరోజు గడుస్తున్నా ఇంతవరకు ఎవరిని అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

# కంటి ఆపరేషన్ బాధితుడిని పరామర్శించిన భానుప్రకాశ్

పుత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :



మునిసిపాలిటీలోని ఒకటో వార్డు పరిధి కొత్త తిమ్మాపురంలో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న టిడిపి నాయకుడు మురుగేష్ రెడ్డిని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ యజమాని ఎవరైనా కంటి ఆపరేషన్ చేయించుకున్నపుడు బాధిత కుటుంబానికి నెలకు రూ. 5000 వేలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎందుకంటే కంటి ఆపరేషన్ చేసుకున్న బాధితులు కనీసం నాలుగు నెలల పాటు ఏ పనులకు వెళ్లకూడదని, విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచిస్తారని ఆ నేపథ్యంలో కుటుంబ పోషణ కష్టంగా వుంటుంది కాబట్టి ప్రభుత్వమే ఆదుకోవాలని స్పష్టం చేశారు. ఇదే గ్రామంలో వెన్నుముక ఆపరేషన్ చేసుకున్న దొర్రై అనే యువకుడిని కూడా భానుప్రకాశ్ పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ డి.ఎస్.గణేష్, టిడిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, వార్డు కౌన్సిలర్ రాధా అశోక్, పట్టణ బిసి సెల్ ఉపాధ్యక్షుడు సంతోష్, వార్డు పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్య రెడ్డి, ప్రధాన కార్యదర్శి అర్జున్ రెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోహిత్‌రెడ్డిని ఆదరించి..ఆశీర్వదించండి!



## ఎమ్మెల్యే డా॥చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుచానూరు,ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

2024 ఎన్నికల్లో చంద్రగిరి శాసనసభ్యుడిగా మొదటి సారిగా పోటీ చేస్తున్న తన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే డా॥చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలను కోరారు.ఆదివారం స్థానిక తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు,కార్యకర్తలు,అభిమానులతో ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 2024 ఎన్నికల్లో వైసిపి తరపున తనకు బదులు తన కుమారుడు మోహిత్‌రెడ్డి పోటీ చేస్తున్నట్లు నాయకులు,కార్యకర్తలు,అభిమానులకు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నన్ను ఎలాగైతే ఆదరించి మీ గుండెల్లో ఉంచుకున్నారో,అదేవిధంగా నా కుమారుడిని కూడా ముందుండి నడిపించి గెలిపించి అసెంబ్లీకి పంపాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర స్థాయిలో పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయడం,ఎన్నికల నిర్వహణ బాధ్యతలు తీసుకోవాల్సి నందున,ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దగ్గరకు వెళ్లాల్సి న పరిస్థితి వచ్చినందున సిఎం జగన్ సూచనల మేరకు తన బిడ్డను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తున్నానని ఆయన చెప్పారు.తాను గత తొమ్మిదేళ్లుగా చంద్రగిరి నియోజకవర్గంలో శత్రువుకు సైతం అన్యాయం చేయకుండా,ప్రతిపక్షాలు సైతం కాదనలేని విధంగా ఇప్పటి వరకు 430 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశానని,అలాగే మరో 90 కోట్లతో కొత్త పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇకపై తనమీద చూపిన ఆదరాభిమానాలను తన కుమారుడపై కూడా చూపాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం తిరుపతి రూరల్ ఎంపిపి,చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ..2014,2019 ఎన్నికల్లో నాన్న గెలుపు కోసం ప్రజల మధ్యకు తాను రావడం జరిగిందన్నారు.అప్పటి నుండే ప్రజల సమస్యలపై తనకు అవగాహన వచ్చిందన్నారు.ఇదే స్ఫూర్తితో 2024 ఎన్నికల్లో తన తండ్రిని గెలిపించినట్లే తనను కూడా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. .అంతకు ముందు వేద పండితులు మోహిత్‌రెడ్డికి ఆశీర్వచనం చేశారు.పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు గజమాలలు,శాలువలు,పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో తిరుచానూరు,పద్మావతిపురం,సాయినగర్,ముండ్లపూడి సర్పంచులు రామచంద్రారెడ్డి,గణపతినాయుడు,రమణ,సురేష్‌రెడ్డి,ఎంపిటిసిలు,జడ్పీటిసిలు,పెద్ద సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## పూడి అరుంధతీవాడలో దాహం..దాహం..

### -ప్రారంభమైన నీటి ఎద్దడి



పంటపొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

వేసవికాలంలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు సంబందిత అధికారులను ఆదేశిస్తున్నా అధికారులు తీరులో మార్పుకనిపించడం లేదు. మండలంలోనిపూడి అరుంధతీవాడలో మోటారు మరమ్మత్తులకు గురై ఐదు రోజులు అవుతున్నా పట్టించుకునే నాధుడు లేదు. దీంతో మహిళలు పంటపొలాల్లో ఉన్న మోటార్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. జడ్పీటిసి స్వగ్రామం అయిన పూడిలోనే ఐదు రోజులుగా మరమ్మత్తులుకుగురైన మోటారును రిపేరు చేయించకుండా ఉండడం గమనార్హం. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

## భూకబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి

### - ఎస్పీ కార్యాలయం ఎదుట మహిళ ధర్నా !!



తిరుపతి క్రైం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

భూకబ్జాదారుల నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఓ మహిళ తిరుపతి ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టింది. ఈసంఘటనకు సంబంధించి బాధితురాలు కృష్ణవేణి తెలిపిన మేరకు వివరాలిలా.. తిరుపతి నగరం వైకుంఠపురం సమీపంలో తాము 2018లో కొచ్చి శేషగిరి రావు అనే వ్యక్తి వద్ద సర్వే నుం 17/2, 17/3, 17/15, 17/16లో మఠానికి చెందిన 1.16 ఎకరాల భూమిని కొనుగోలు చేశామన్నారు. అయితే 2019లో సర్పంచ్ రమణ, మధునిరంజన్, కరుణాకర్ అనే వ్యక్తులు తమ భూమిని కబ్జా చేశారని పేర్కొన్నారు. దీనిపై తాము ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అయితే కబ్జాదారులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈఏడాది మార్చి 7వతేది తన చెల్లిపైన కొందరు దౌర్జన్యం చేసి కొట్టారని దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తమకు న్యాయం చేయలేదని బాధితురాలు వాపోయింది. అనంతరం సి.ఐ. సురేంద్రనాథ్‌రెడ్డి, ఎస్సై వినోద్‌కుమార్‌లు బాధితురాలు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు చేసిన భూమిని పరిశీలించారు.

## ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని సందర్శించిన మంత్రి



నగరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

మంత్రి రోజా చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో జరగనున్న ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆదివారం మంత్రి రోజా సాయంత్రం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నేడు సోమవారం నుంచి 10వ తేదీ వరకు నగరిలో మంత్రి కార్యాలయంలో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో జరిగే ఉచిత కంటి వైద్య శిబిరంలోఆపరేషన్ నిర్వహించి రోగులకు కంటి అద్దాలు, మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. కంటికి సంబంధించిన అన్ని రకాల జబ్బులకు చికిత్స చేసి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ఆర్‌అండ్‌బి రోడ్డు ఆక్రమణలకు నిలయం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్‌అండ్‌బి రోడ్డు ఆక్రమణలకు నిలయంగా మారింది. గత కొంత కాలంగా రోడ్డుపై ఆక్రమణలను ఎవరూ పట్టించు కోకపోవడంతో ఎవరికి వారు యథేచ్ఛగా ఆక్రమణలు చేసుకుంటున్నారు. చిన్న పాటి టెంట్లు వేసుకొని బండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకుం టున్నారు. హోలీక్రాస్ జంక్షన్ రోడ్డు నుంచి పాత మనోహర్ మహల్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఒక సినిమాల్లో చెప్పినట్లు 'ఊరు మనదే తోసెయ్' అనే డైలాగు చెప్పినట్లు, రోడ్డు మనదే వేసెయ్ పాగా అన్నట్లు ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. దీంతో ఆర్‌అండ్‌బి రోడ్డుపై తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. ముఖ్యంగా పాత సిండికేట్ బ్యాంకు సెంటర్, ఆర్టీసీ బస్టాండు వద్ద ఎక్కడపడితే అక్కడ ఆక్రమణలు ఉండటంతో వాహనాలను రోడ్డుపై నిలిపేస్తున్నారు. దీంతో తరచూ ఏదో ఒక రూపంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల పోలీసులు స్పందించి ఆక్రమణలను క్రమబద్ధీకరించారు. తర్వాత ఏమైందో ఏమో గాని అసలు ట్రాఫిక్ గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. సిబ్బంది కొరత అని సాకు మాత్రం చూపుతున్నారు. మరోవైపు మున్సిపాలిటీ వారు కూడా తమకెందుకులే అన్న ధోరణిలో ఉండటంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను క్రమబద్ధీకరించకపోతే ప్రజలు కూడా ప్రమాదాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## ఉత్కంఠ భరితంగా ముగిసిన క్రికెట్ టోర్నీ

### విన్నర్లుగా రేణిగుంట, రన్నర్లుగా తూకివాకం

రేణిగుంట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



మార్చి 22 తేదీ బుధవారం తూకివాకం క్రీడా మైదానంలో ప్రారం భమైన ఎంఎస్ఆర్ క్రికెట్ టోర్నీ ఏప్రిల్ 2 తేదీ ఆదివారం ముగి సింది. నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరి గాయి. వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. సుమారు 50 నుంచి 60 టీములు క్రీడా మైదానంలో తలబడ్డాయి. ఆదివారం సాయంత్రం జరిగిన ఫైనల్స్‌లో తూకివాకం రేనిగుంట జట్లు పోటీల్లో తలపడ్డాయి. పోటీ చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగింది. తూకివాకం జట్టు మొదట బ్యాటింగ్ చేసి 89 పరుగులు చేసింది. 90 పరుగుల లక్ష్యంతో పోటీలో రేణిగుంట జట్టు దిగింది. నిర్ణీత 10 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి విన్నర్స్‌గా నిలిచారు. తూకివాకం జట్టు రన్నర్స్‌తో సరిపెట్టుకుంది. గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డి తరపున తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి బహుమతులు, నగదు పారితోషికాన్ని అందజేశారు. క్రీడాకారులు సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. గెలుపొందిన క్రీడాకారులను తిరుపతి ఎక్స్‌పర్ట్ మొబైల్స్ డిజిటల్ అధినేత కిషోర్‌రాజు, చక్రధర్ తదితరులు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చౌడేపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని శెట్టిపేట పంచాయితీ మేకలచిన్నేపల్లికి చెందిన సుష్మ(32)కూలి పనులు చేసుకొంటూ జీవిస్తోంది. ఈక్రమంలో కర్ణాటక రాష్ట్రం హెబ్బిణివద్ద గల రాజులూరులో తన పిల్లలను విడచిపెట్టి టూవీలర్‌పై సొంత గ్రామానికి తిరిగి వస్తుండగా చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారి డి.రాజులూరు వద్ద నూతనంగా నిర్మితమవుతున్న రోడ్డుపై వున్న గతుకులను గమనించకుండా రావడంతో స్కూటర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో సుష్మ తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకొన్న ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గ్రామంలో మంచి పేరున్న సుష్మ మరణవార్త వినగానే మేకలచిన్నేపల్లిలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

## పేదరికంలో పుట్టి ఆర్డిఓ స్థాయికి ఎదిగి

### సుపరిపాలనతో ప్రజా సమస్యలు పరిష్కారం

### గూడూరు ఆర్డివో కిరణ్ కుమార్ సేవలకు సలాం అంటున్న గూడూరు నియోజకవర్గ ప్రజలు



గూడూరు ఆర్డివో మీసాల కిరణ్ కుమార్ ఫైల్ ఫోటో

గూడూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :

జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల కృషి ఉన్నప్పుడే అందుకు తల్లిదండ్రులు, గురువులు, ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అని గూడూరు ఆర్డివో, గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మీసాల కిరణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. తన జీవిత ఉద్యోగ ప్రస్తానాన్ని ప్రభాతవార్త ప్రతినిధితో పంచుకున్నారు. చిత్తూరుజిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పీలేరు మండలం వేపులా బైలు గ్రామంలో ఓ నిరుపేద కుటుంబంలో ఆయన జన్మించారని అన్నారు. చదువుకునే రోజుల్లోనే పెద్ద అధికారి నై ప్రజలకు గ్రామానికి సేవ చేయాలనే తలంపుతో కష్టపడి చదివి ప్రయోజకుడునై పదిమందికి సేవ చేయాలన్నదే తన ఆకాంక్ష అని మదిలో నాటుకున్నారు. ఆయన చిన్న వయసు నుంచి కష్టపడి, ఇష్టపడి పట్టుదలతో చదివి, విద్యాభ్యాసం పూర్తి చేశారు. 2005వ సంవత్సరంలో ప్రభుత్వం గ్రూప్ టు ప్రవేశ పరీక్షలో డిప్యూటీ తహశీల్దార్ తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించారు. అనతి కాలంలోనే పదోన్నతిపై తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. పదోన్నతులు మీద ప్రస్తుతం గూడూరు ఆర్డివోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**- తల్లిదండ్రులు మా అన్నయ్య నాకు స్ఫూర్తి**

తన చదువుకు అన్ని వేళలా సహాయ సహకారాలు అందించిన తన తల్లిదండ్రులు, అన్నయ్య స్ఫూర్తి అని వారు చూపిన మార్గంలో కింద స్థాయి నుంచి ఉన్నత స్థాయికి రావడానికి మార్గం చూపిన తల్లిదండ్రులకు, అన్నయ్యను దైవ సమానంగా భావించి భావితరాలకు మార్గదర్శకంగా ఉండాలన్నదే నా ఆశయం అని పేర్కొన్నారు. గూడూరు నియోజకవర్గం ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలుసుకుని పరిష్కరించుకుంటూ పోతూ గూడూరు నియోజకవర్గం అభివృద్ధి చేయడంతో ముందంజలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు ఆయన చేస్తున్న కృషి గర్వించదగ్గ విషయం గూడూరు నియోజకవర్గం కీర్తి ప్రతిష్టలను మరింత పెంచుతున్నారు.

## రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సిఎం కావాల్సిందే

### - కుప్పం తెలుగుయువత అధ్యక్షుడు మణి

### - వైకాపా పాలనలో ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలు



కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

రా ష్ట్రం బాగుపడాలంటే మరలా చంద్రబాబునాయుడు సిఎం కావాల్సిన అవసరం ఉందని కుప్పం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చెక్కునత్తం మణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా, 2.30లక్షల ఉద్యోగాలు అన్న సిఎం జగన్‌రెడ్డి ఆమాటలు మరచిపోయారన్నారు. ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించిందన్నారు. జాబ్ కేలండర్ లేదని నాలుగేళ్లలో ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. రాష్ట్రంలో ప్రజలు, యువత సిఎం జగన్ మాయమాటలు నమ్మి మోసపోయారన్నారు. రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు వెనక్కు వెళ్లాయన్నారు. యువత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపాకు 108 నియోజకవర్గాల్లో గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. యువతకు ఇచ్చిన మాట తప్పిన సిఎం రాజీనామా చేయాలని ఆయనకు పాలించే అర్హత లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో పోలీసుల పాలన సాగుతోందని విమర్శించారు. శాంతిపురం అధ్యక్షుడు సుబ్బు మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా గంజాయి వంటి అక్రమ వ్యాపారాలను రాష్ట్రంను కేంద్రంగా మలచడం దారుణమన్నారు. సమావేశంలో తెలుగుయువత నేతలు మంజు, సుధాకర్, గోపి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో వేమిరెడ్డిపూజలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఆదివారం రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు.వారికి దక్షణ గోపురం వద్ద శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సతీమణి బియ్యపు వాణి తనయ బియ్యపు పవిత్రారెడ్డిలు స్వాగతం పలికారు. ఆలయంలో బంగారు వాహనాలను అందించిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఆలయం తరఫున ఘనస్వాగతం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.తరువాత వారికి బియ్యపు కుటుంబం దారుశిల్పాన్ని అందించారు.

## జాతీయ స్థాయి బాక్సింగ్‌లో రాహుల్‌కు వెండి పతకం



విజయపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :

జాతీయ స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విజయపురం మండలం నారపరాజుకండ్రిగకు చెందిన రాహుల్ వెండి పతకం సాధించి ప్రశంసా పత్రం అందుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం దివాస్ నగరంలో ఆదివారం నిర్వహించిన జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఇతను నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శోభా రామకృష్ణమరాజు కుమారుడు, సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా తమిళనాడు చెన్నైలో స్థిరపడి బాక్సింగ్‌పై ఆసక్తి కనపరిచేవారు. ఆయన ప్రతిభకు తగిన గుర్తింపు లభించిందని తల్లి తండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## నిరుద్యోగ యువతను మోసం చేసిన జగన్‌రెడ్డి

### జాబ్ క్యాలెంటర్, 2.40 ఉద్యోగాల భర్తీ ఏమైంది ?

### టిడిపి ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :

రాష్ట్రంలో యువతకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిరుద్యోగ యువతను నిండా మోసం చేశారని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ ఆరోపించారు. ఆదివారం పుత్తూరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, రాష్ట్రంలో 2.40 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని గత ఎన్నికలపుడు ఊరూరా తిరుగుతూ జగన్మోహనరెడ్డి వాగ్దానాలు చేశారని, దానిని నమ్మిన ప్రజలు ఓట్లేసి గెలిపించారన్నారు. అయితే ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. భర్తీ చేస్తామని చెప్పిన 2.40 లక్షల ఉద్యోగాలు ఎక్కడకు పోయాయని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నపుడు పోలీస్ శాఖలో 35,000 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. గత నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రెండు వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని తెలిపారు. కమీషన్లు డిమాండ్ చేయడం వల్ల పారిశ్రామిక వేత్తలు బెదిరిపోయి ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో మూడున్నర ఏళ్లలో 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని తెలిపారు. టిడిపి హయాంలో రెండు సార్లు డిఎస్సీ నిర్వహించి 18 వేలు ఉద్యోగాలిచ్చామని, ప్రతి ఏటా మెగా డిఎస్సీ అని చెప్పిన జగన్ రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగాన్ని భర్తీ చేయలేదని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వంలో నెలకు రూ. 2,000 వేలు నిరుద్యోగ భృతి ఇచ్చారని, అది కూడా రద్దు చేశారని, చేసిన రూ. 10 లక్షల కోట్ల అప్పులు ఏం చేశారో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది కోట్ల అప్పులు కుప్పగా పేరుకుపోయింది తప్ప... రాష్ట్రంలో ఒక్క సిమెంట్ రోడ్డు వేసింది లేదన్నారు. ఎస్సీ, బిసి, అగ్రవర్ణాల్లో పేదలకు వారి సొంత కాళ్లపై నిలబడి జీవించేలా స్వయం ఉపాధి కోసం రుణాలు ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక రాష్ట్రంలో యువత గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో గంజాయి అక్రమ రవాణాలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో వుందని, వ్యసనాల బారిన పడి రాష్ట్రంలో 571 మంది యువత ఆత్మహత్యకు పాల్పడినట్టు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నివేదిక స్పష్టం చేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా యువతను మోసం చేయడం మాని జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధే అజెండాగా..శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా..

### -రాష్ట్ర కార్యదర్శి చలపతినాయుడు సారధ్యంలో ఇంటింటికి బొజ్జల కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇంటింటికి బొజ్జల కార్యక్రమాలను ఈ నెల 5 నుంచి నియోజవర్గానికి ఈశాన్యంలో వెలసిన సింగమాల గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించటానికి సుమూహూర్తంగా నిర్ణయించినట్లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గాలిచలపతి నాయుడు ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా చలపతి నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని దీర్ఘకాలం బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పరిపాలించారని వివరించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నియోజకవర్గాన్ని పరిపాలించిన తెలుగుదేశం పార్టీ హయాంలో అభివృద్ధి శూన్యం తామే అన్ని చేస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని వివరించారు. అయితే తెలుగుదేశంపార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికి వివరించుటకు ఆయన తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి నిర్ణయించారన్నారు. పార్టీ అధిష్టానం అదేశాలతో విన్నూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని 1983 నుంచి ఒక్కసారి తప్ప పరిపాలించిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రజలకు సామాజికాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు.అంతేకాక గ్రామాల అభివృద్ధి రైతు సంక్షేమానికి యువతకు ఉపాధి, నిరుపేదలకు విద్య, కార్పొరేట్ వైద్యం అందించుటంలో ముందంజలో ఉండేదన్నారు.అలాగే నియోజకవర్గంలో 'శాంతి భద్రతల పరిరక్షణకు'ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. ఏ నాడు పోలీసుస్టేషన్లో 'పలుకుబడి' ఉపయోగించే వారు కాదు. అయితే నేడు నియోజకవర్గంలో ఏం జరుగుతుందని చలపతినాయుడు ప్రశ్నించారు. నిష్కారణంగా కొందరు దేశం నాయకులను టార్గెట్‌చేసి దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే తనపై కూడా దాడి చేసి తనకారు అద్దాలను పగుల గొట్టిన వారికి పాలకులు ధర్మకర్తల మండలి సభ్యుడుగా నియమించారు. ఇక దళిత,గిరిజనులకు రక్షణగా రూపొందించిన చట్టాన్ని తమ రాజకీయ మనుగడ కోసం నాయకులను భయభ్రాంతుల్ని చేయటానికి ఉపయోగించుకుంటూ ప్రతిపక్షాలకు భయం కల్గించటానికి ప్రయత్నిస్తున్నారని అలాంటి చీప్ పాలిట్రిక్స్ తెలుగుదేశం నాయకుడు ఏ నాడూ ప్రయోగించలేదన్నారు.

**అభివృద్ధి ఎందుకు జరగలేదు?**

శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధి ఎందుకు జరగలేదు? బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో జన్మభూమి కార్యక్రమాల్లో ఒక నాడు శ్రీకృష్ణదేవరాయాలు తవ్వించిన చెరువులు పూడి పోతే వాటిని జన్మభూమి కార్యక్రమాల్లో బాగు చేయించారన్నారు. అలాగే తెలుగుగంగ కాలువ ద్వారా శ్రీకాళహస్తి మున్సిపాలిటికి అధికారికంగా ఒక టిఎంసి నీటిని ప్రభుత్వం ద్వారా సాధించి నేడు శ్రీకాళహస్తి ప్రజలు కటిక వేసవి కాలంలో కూడా నీటికి ఇబ్బంది లేకకుండా దాహార్తిని తీర్చుకుంటున్నారంటే అది బొజ్జల పుణ్యం కాదా? రేణిగుంటకు తెలుగుగంగను అందించింది బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కాదా? అని చలపతి నాయుడు ప్రశ్నించారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన తెలుగుదేశం పార్టీ ప్రగతి గురించి ఇంటింటికి వెళ్ళి వివరించుటకు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారన్నారు. ఈ కార్యక్రమాలను తొట్టంబేడుమండలం నుంచి శ్రీకారం చుట్టనున్నారని చలపతి నాయుడు వివరించారు. ఇందుకు ఏర్పాట్లు చేసామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఇంటింటికి వెళ్ళి వివరించనున్నట్లు చలపతి నాయుడు ప్రభాతవార్తకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.